

రక్తదానం

గోపాలపట్నం: నేవల్ సైన్స్ అండ్ టెక్నాలజీ లేబొరేటరీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సిబ్బంది మంగళవారం రక్తదానం చేశారు.



ఘనంగా శ్రావణలక్ష్మి పూజలు

విశాఖ నగరంలో వెలిసిన కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శ్రావణలక్ష్మి పూజలు ఘనంగా జరుగుతున్నాయి.

వాతావరణం

అనకాపల్లి: రాగల ఐదు రోజులలో ఆకాశం మేఘావృతమై ఉండి, తేలికపాటి వర్షం పడే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గరిష్ట ఉష్ణోగ్రత 35 నుంచి 35.4 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 26.3 నుంచి 27 డిగ్రీలు నమోదయ్యే అవకాశం ఉందన్నారు.

న్యూస్‌రీల్

108 వాహనంలో ప్రసవం



108 వాహనంలో జన్మించిన బిడ్డతో సిబ్బంది

దేవరాపల్లి: వాలాబు పంచాయతీ రామన్నపాలేనికి చెందిన గర్భిణి గిమ్మెల లక్ష్మి 108 వాహనంలో ప్రసవించింది. ఆమెకు మంగళవారం ఉదయం పురిటి నొప్పులు రావడంతో దేవరాపల్లి పీహెచ్‌సీకి తీసుకెళ్లగా అక్కడ తనిఖీ చేసిన వైద్య సిబ్బంది మెరుగైన వైద్య సేవల కోసం కె.కోటపాడు కమ్యూనిటీ ఆస్పత్రికి పంపించారు. 108లో తీసుకువెళుతుండగా ఎ.కోడూరు సమీపంలోకి రాగానే ఒక్కసారి నొప్పులు అధికమయ్యాయి. వెంటనే అప్రమత్తమైన 108 సిబ్బంది వైద్య సేవలందించగా పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారు. సుఖ ప్రసవం చేసిన 108 సిబ్బందిని పలువురు అభినందించారు.

త్వరితగతిన బంగారు కుటుంబాలకు మ్యాపింగ్

- కలెక్టర్ విజయ కృష్ణన్



మ్యాపింగ్‌పై అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: బంగారు కుటుంబాలను మ్యాపింగ్ చేయడానికి అవసరమైన మార్గదర్శుల ఎంపిక త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. స్వర్ణాంధ్ర జీరో పోవర్టి -పీ4 మ్యాపింగ్‌పై సీఎం నారా చంద్రబాబునాయుడు మంగళవారం అమరావతి నుంచి ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లతో నిర్వహించిన వర్చువల్ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమావేశమై మాట్లాడారు. ఇప్పటి వరకు ఎంపిక చేయబడిన మార్గదర్శులను బంగారు కుటుంబాలకు మ్యాపింగ్ పూర్తి చేయాలన్నారు. ఈ నెల 15వ తేదీకి లక్ష్యం సాధించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. శాఖల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను సాధించే దిశగా అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ముఖ్య ప్రణాళికా అధికారి బి.రామారావు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర హాకీ జట్టుకు ముగ్గురు బాలికలు



రాష్ట్ర జట్టుకు ఎంపికైన హాకీ క్రీడాకారిణులు

యలమంచిలి రూరల్: జూనియర్ మహిళల రాష్ట్ర హాకీ జట్టుకు జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారిణులు ఎంపికైనట్టు హాకీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొఠారు నరేష్ మంగళవారం స్థానిక విలేకరులకు తెలిపారు. దేవరాపల్లి మండలం పెదనందిపల్లి గ్రామానికి చెందిన బొబ్బిలి ఝాన్సీ, కె కోటపాడు మండలం ఎ.భీమవరం గ్రామానికి చెందిన తర్ర శైలజ, నక్కపల్లికి చెందిన కొఠారి లలిత జిల్లా నుంచి రాష్ట్ర హాకీ జట్టులో చోటు దక్కించుకున్నారు. వీరు కాకినాడలో జరుగుతున్న జాతీయ హాకీ పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిథ్యం వహిస్తున్నారని నరేష్ తెలిపారు. ఈ పోటీలు ఈ నెల 10వ తేదీ వరకు జరుగుతాయన్నారు.

రాయి తరలిస్తున్న లారీల అడ్డగింత



దళిత రైతులు అడ్డుకోవడంతో నిలిచిపోయిన లారీలు

మాకవరపాలెం: నల్లరాయి తరలిస్తున్న లారీలను దళిత రైతులు అడ్డుకున్నారు. జి.కోడూరు రెవెన్యూలోని 332 సర్వే నంబర్‌లో నిర్వహిస్తున్న క్వారీ కారణంగా సమీపంలో ఉన్న భూములకు నష్టం వాటిల్లుతుందని, ఈ క్వారీ అనుమతులు రద్దు చేయాలని దళిత రైతులు గత 14 రోజులుగా నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి క్వారీ నుంచి రాయిని తరలిస్తున్న నాలుగు లారీలను వారు అడ్డుకున్నారు. తమకు నష్టం కలిగించే క్వారీ నిర్వహించేందుకు వీల్లేదని వారు స్పష్టం చేశారు.

జనాభీష్టానికి విలువ దక్కేనా?

- బల్క్‌డ్రగ్ పార్క్ ఏర్పాటుపై నేడు ప్రజాభిప్రాయ సేకరణ
- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న మత్స్యకారులు
- బాసటగా నిలిచిన ప్రజాసంఘాలు
- వేదిక వద్ద భారీ బందోబస్తు





బల్క్‌డ్రగ్ పార్క్ కోసం చురుగ్గా జరుగుతున్న మౌలిక సదుపాయాల పనులు, (ఇన్‌సెట్) ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ చెల్లించాలంటూ ఆందోళన చేస్తున్న నిర్వాసితులు (ఫైల్)

నక్కపల్లి: మూడు రాష్ట్రాలతో పోటీపడి సాధించిన బల్క్‌డ్రగ్ పార్క్ ఏర్పాటుకు సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణ బుధవారం జరగనుంది. నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జరిగే ఈ ప్రజాభిప్రాయ సేకరణకు విస్తృత ఏర్పాటు జరుగుతున్నాయి. 200మంది పోలీసులతో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. మండలంలో రాజయ్యపేట సమీపంలో ఏర్పాటు చేయనున్న ఈ బల్క్‌డ్రగ్ పార్క్ వల్ల ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని, ప్రజల ప్రాణాలను హరించే ఈ ప్రమాదకరమైన బల్క్‌డ్రగ్ పార్క్ ఏర్పాటు చేయవద్దంటూ మత్స్యకారులు, పార్క్ ప్రభావిత ప్రాంతాల వారు ఆందోళన చేస్తున్నారు. పాదయాత్రలు, నిరసన కార్యక్రమాలు, ధర్నాలు చేస్తున్నారు.

ఈ నేపథ్యంలో ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవడంతోపాటు, ప్రాజెక్టు గురించి వివరించి ఇక్కడ ఏయే పరిశ్రమలు ఏర్పాటు కాబోతున్నాయి, ఎంతమందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి, ప్రజల జీవన విధానానికి నష్టం వాటిల్లకుండా తీసుకునే చర్యల గురించి అధికార యంత్రాంగం వివరించి ప్రజల నుంచి అభిప్రాయాలు తీసుకోనుంది.

అదనపు భూసేకరణపై నిరసనలు

బల్క్‌డ్రగ్ పార్క్ ఏర్పాటు కోసం రాజయ్యపేట, చందనాడ, బోయపాడు, అమలాపురం, బుచ్చిరాజుపేట, పాటిమీద, మూలపర గ్రామాల్లో ఏపీఐఐసీ సేకరించిన భూముల్లో 2 వేల ఎకరాలు కేటాయించారు. ఇది చాలదన్నట్లు పెదతీనార్ల, జానకయ్యపేట, సిహెచ్‌ఎల్ పురం, ఎస్.రాయవరం మండలం గుర్రాజుపేట గ్రామాల్లో మరో 800 ఎకరాలు సేకరించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిపై తీవ్రంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల ప్రాణాలను హరించే బల్క్‌డ్రగ్ పార్క్ రద్దు చేయాలని బుధవారం నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకుంటామంటూ ప్రభావిత గ్రామాల వారు తీవ్రంగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. అదనంగా భూములు ఇచ్చేది లేదని, పార్క్ ఏర్పాట్లను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ కొద్ది రోజులుగా పాదయాత్రలు, ధర్నాలు, తహసీల్దార్ కార్యాలయాల ముట్టడి వంటి కార్యక్రమాలు చేస్తున్నారు.

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీపై కొనసాగుతున్న ఆందోళనలు

బల్క్‌డ్రగ్ పార్క్ కోసం నివాస ప్రాంతాలు కోల్పోతున్న నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ పూర్తి స్థాయిలో ఇవ్వలేదని నిర్వాసితులు రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నారు. 2014 భూసేకరణ సమయంలో నిర్వాసిత కుటుంబాల్లో పెళ్లి కాని ఆడ, మగ పిల్లలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇస్తామని హామీ ఇచ్చారని, ఇప్పుడు పెళ్లయిన ఆడపిల్లలకు ప్యాకేజీ ఇవ్వడం లేదంటూ ఆందోళన చేస్తున్నారు.

నిర్వాసితులకు అండగా వైఎస్సార్‌సీపీ, సీపీఎం

బాధిత రైతాంగానికి వైఎస్సార్‌సీపీ, సీపీఎంలతోపాటు, పలు ప్రజాసంఘాలు మద్దతు ప్రకటిస్తున్నాయి. ఆందోళనకారులను, వారికి సంఘీభావం ప్రకటించే నాయకులను ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలు చేసే అవకాశాలు కలిపిస్తున్నాయి. ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజాభిప్రాయసేకరణను అడ్డుకుంటామని, తమ నిరసన తెలియజేస్తామంటూ మత్స్యకారులు నాయకులు చెబుతున్నారు. ప్రజాభిప్రాయ సేకరణ నేపథ్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొనే పరిస్థితి కనిపిస్తోంది.

1270 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు

ఏపీఐఐసీ ద్వారా ఆంధ్రప్రదేశ్ బల్క్ డ్రగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ వారు దీన్ని ఏర్పాటు చేయనున్నారు. మందుల పరిశ్రమలకు అవసరమైన ముడిసరుకు తయారు చేసే యూనిట్లు ఇక్కడ నెలకొల్పుతారు. కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం 2 వేల ఎకరాలను కేటాయించింది. ప్రాజెక్టు రిపోర్టు ప్రకారం 1270 ఎకరాల విస్తీర్ణంలో ఈ పార్క్ ఏర్పాటు చేయనున్నారు. క్రియాశీల ఔషధ పదార్థాలు (ఏపిఐలు), ముఖ్యప్రారంభ పదార్థాలు (కేఎస్‌ఎంలు), రసాయన సంకలనం, ఔషధ సూత్రీకరణ వంటి కార్యకలాపాలు ఇక్కడ నిర్వహిస్తారు. ఈ కంపెనీకి రోజుకు 44.96 మిలియన్ లీటర్ల నీరు అవసరమవుతుంది. 20.59 మిలియన్ లీటర్ల నీటిని ఏలేరు కాలువ నుంచి పైపులైన్ల ద్వారా సరఫరా చేస్తారు. మరో 24.37 మిలియన్ లీటర్ల నీటిని రీసైక్లింగ్ ద్వారా ఉపయోగించుకుంటారు. ఈ పార్క్ నుంచి రోజుకు 25.36 మిలియన్ లీటర్ల పారిశ్రామిక వ్యర్థ జలం, 0.67 మిలియన్ లీటర్ల మురుగు నీరు ఉత్పత్తి అవుతాయి. దీనికనుగుణంగా 24.24 మిలియన్ లీటర్ల సామర్థ్యం కలిగిన శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. రూ.24 కోట్ల వ్యయంతో జాతీయరహదారి కాగిత నుంచి తమ్మయ్యపేట వరకు 4 కిలోమీటర్ల డబుల్ రోడ్డు నిర్మిస్తున్నారు. ఏపీఐఐసీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న బల్క్‌డ్రగ్ పార్క్ మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.1100 కోట్ల వ్యయంతో రోడ్లు, డ్రైయినేజీలు, తాగునీరు, వాడుక నీరు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించే పనులు గడచిన మూడు నెలల నుంచి చురుగ్గా జరుగుతున్నాయి. గుల్లిపాడు రైల్వేస్టేషన్ నుంచి 9.6 కిలోమీటర్ల రైల్వేలైను కూడా ఏర్పాటు చేసే ప్రతిపాదన ఉంది. 184 ఎకరాల్లో గ్రీనరీ ఏర్పాటు చేయనున్నారు. ప్రాజెక్టు నిర్మాణ దశలో 750 మందికి, కార్యకలాపాల దశలో 17 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుందని ఏపీఐఐసీ వర్గాలు చెబుతున్నాయి. పూర్తి కార్యకలాపాలు ప్రారంభమయిన తర్వాత 25 వేల మందికి ఉపాధి కలుగుతుందని చెబుతున్నారు.

యాజమాన్యం నిర్లక్ష్యంతోనే లుపిన్ ఫార్మా ప్రమాదం

- మానవ హక్కుల వేదిక వెల్లడి

సాక్షి, అనకాపల్లి:

పరవాడ జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మా సిటీలో ఉన్న లుపిన్ ఫార్మా కంపెనీలో గ్యాస్ లీకేజీ ఘటన పూర్తిగా యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే జరిగిందని మానవ హక్కుల వేదిక (హెచ్‌ఆర్‌ఎఫ్) వెల్లడించింది. హెచ్‌ఆర్‌ఎఫ్ బృందం పరిశీలనలో వెల్లడైన విషయాలను వేదిక ఉమ్మడి విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి అనురాధ, జిల్లా సహాయ కార్యదర్శి రెహ్మాన్ ఒక ప్రకటనలో వివరించారు. ఈనెల 4వ తేదీ తెల్లవారుజామున 3 గంటల సమయంలో లుపిన్ ఫార్మాలో మల్టీ ప్రొడక్షన్ బ్లాక్-2లో లేటర్ మూవర్ ఔషధ తయారీ సమయంలో ప్రమాదకమైన విషవాయువులు విడుదలయ్యాయి. ఆ విషవాయువు పీల్చి ఒకరు తీవ్రంగా అస్వస్థతకు గురై ఐసీయూలో, మిగిలిన నలుగురు క్యాజువాల్టీలో చికిత్స పొందుతున్నారు. అయితే అదే రోజు సాయంత్రానికి వారి పరిస్థితి విషమం కావడంతో అందరినీ ఐసీయూలో చేర్చారు. ఈ ఔషధ తయారీ ప్రక్రియలో అత్యంత ప్రమాదకర కెమికల్స్ వాడుతున్నట్లు వెల్లడయ్యింది. ఇటువంటి ప్రమాదకర కెమికల్స్ వినియోగిస్తున్నప్పుడు అవసరమైన నిబంధనలు, సరైన రక్షణ పద్ధతులు పాటించకపోతే తీవ్రమైన శ్వాస సంబంధిత సమస్యలకు దారితీసే ప్రమాదం ఏర్పడుతుందని వెల్లడించారు. విషవాయువులు లీకైన గదిలో ఒక్కరే ఉన్నారని.. ప్రమాదం జరిగిన విషయాన్ని తెలుసుకుని పక్క గది నుంచి వెళ్లిన మిగిలినవారు కూడా అస్వస్థతకు గురైనట్టు చెప్పారు. భద్రతను గాలికి వదిలేశారని, నియంత్రణ సంస్థల పర్యవేక్షణ పూర్తిగా లోపించిందని మానవ హక్కుల వేదిక వెల్లడించింది. కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను చూసేందుకు కనీసం వారి కుటుంబ సభ్యులను కూడా లోపలకి అనుమతించలేదన్నారు. మానవ హక్కుల వేదిక బృందం రంగంలోకి దిగడంతో లోపలకి పంపించారని తెలిపారు. తీవ్ర అస్వస్థతకు గురైన షిఫ్ట్ ఇన్‌చార్జి ఎం.సాయికుమార్ పరిస్థితి విషమంగానే ఉంది. మిగిలిన వారిలో కెమిస్ట్ గణేష్ మినహా మిగిలిన నలుగురు పి.శివనాయుడు (కెమిస్ట్), కె.రాజశేఖర్ కుమార్ (షిఫ్ట్ ఇన్‌చార్జి), యు.నరేష్‌కుమార్ (షిఫ్ట్ ఇన్‌చార్జి), బి.రామానాయుడు (ఆఫీస్ స్టాఫ్) ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు వెల్లడించారు.

సుగర్ ఫ్యాక్టరీల మూసివేత చంద్రబాబు ఘనతే

- గోవాడ సుగర్స్ రైతు బకాయిలు రూ. 30 కోట్లు
- రైతులంటే కూటమి ప్రభుత్వానికి లెక్కలేదు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్



బంగారుమెట్టలో మాట్లాడుతున్న అమర్‌నాథ్

బుచ్చెయ్యపేట: రాష్ట్రంలో సుగర్ ఫ్యాక్టరీలను మూసివేసిన ఘనత సీఎం చంద్రబాబుదే అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ విమర్శించారు. మండలంలోని బంగారుమెట్ట గ్రామంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ఏకైక ప్రభుత్వ సుగర్ ఫ్యాక్టరీ(గోవాడ)ని కాపాడుకోలేని స్థితిలో కూటమి సర్కారు ఉందన్నారు. ఈ ఏడాది ఫ్యాక్టరీకి చెరకు సరఫరా చేసిన రైతులకు రూ. 30 కోట్ల వరకు పేమెంట్లు చెల్లించకుండా ఏడిపిస్తున్నారని ధ్వజమెత్తారు. నవంబర్‌లో మొదలెట్టాల్సిన గానుగాట జనవరిలో ప్రారంభించి కేవలం లక్షా 8 వేల టన్నుల వరకే క్రషింగ్ చేయడం సిగ్గుచేటన్నారు. ఎనిమిది వేల టన్నుల వరకు పేమెంట్లు చేసి ఇంకా లక్ష టన్నుల వరకు చేయలేదన్నారు. మాడుగుల, చోడవరం సీనియర్ ఎమ్మెల్యేలు ప్రభుత్వం దృష్టికి రైతుల సమస్యలను తీసుకెళ్లి ఆదుకున్న పాపాన పోవడం లేదన్నారు. త్వరలో సుగర్ ఫ్యాక్టరీ మహాజన సభకు ఇద్దరు ఎమ్మెల్యేలు వచ్చి రైతులకు సమాధానాలు చెప్పే సాహసం చేయగలరా అని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ హయాంలో రైతులకు ఏమీ చేయలేదని, పరిశ్రమలు రాలేదని చోడవరం ఎమ్మెల్యే ప్రకటనలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తాను మంత్రిగా ఉన్న హయాంలోనే మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ద్వారా రూ.89 కోట్లు మంజూరు చేయించి ఫ్యాక్టరీ రైతులకు, ఉద్యోగులకు బకాయిలు చెల్లించామన్నారు.

కూటమి పాలనలో కొత్త పరిశ్రమలు ఏర్పాటు కన్నా ఉన్నవాటిని మూతపడకుండా చేయాలన్నారు. రైతులకు ఎరువులు దొరకని పరిస్థితుల్లో పాలన ఉందని ఎద్దేవా చేశారు. సీఎం చంద్రబాబు పాలనలో ప్రకృతి సహకరించక ఆగస్టులోనూ చుక్కనీరు లేక గెడ్డలు, వాగులు ఎండిపోయి రైతులు సాగు చేయలేని దుస్థితిలో ఉన్నారన్నారు. 15 నెలలుగా ప్రజలకు చేసిందేమీ లేకపోయిన పూర్తిస్థాయిలో సూపర్ సిక్స్ అమలు చేశామని కూటమి నేతలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. రోడ్లు బాగు చేయని స్థితిలో కూటమి పాలన ఉందని విమర్శించారు. పేదలు, రైతుల సమస్యల పరిష్కారంలో వైఎస్సార్‌సీపీ పోరాటాలు చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు కె.అచ్చింనాయుడు, జెడ్పీటీసీ దొండా రాంబాబు, వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణమూర్తి, గొంపా చినబాబు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, జిల్లా కార్యదర్శి జోగా కొండబాబు తదితరులు పాల్గొన్నారు.



అంధకారం.. తాండవం!

తాండవ ప్రాజెక్టులో విద్యుత్ దీపాలు వెలగక అంధకారం అలముకుంది. కూటమి ప్రభుత్వం వచ్చాక లైట్లు ఏర్పాటు చేయలేదు. ఈనెల 10న సాగునీరు విడుదల చేయనున్న నేపథ్యంలో ఈ సమస్య తీర్చాలని సిబ్బంది కోరుతున్నారు. 10లో



చదువుల తల్లికి సత్కారం

ఐఏఎస్‌కు ఎంపికైన డాక్టర్ మానస మునగపాక అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ఆరోగ్య శాఖ కార్యదర్శి కావాలన్నది తన కోరిక అని ఆమె చెప్పారు. 10లో

నేడు స్టాండింగ్ కమిటీ ఎన్నిక

- 10 మందిని ఎన్నుకోనున్న కార్పొరేటర్లు
- బరిలో వైఎస్సార్ సీపీ, టీడీపీ



దాబాగార్డెన్స్ (విశాఖ): మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) స్టాండింగ్ కమిటీ ఎన్నికలు బుధవారం జరగనున్నాయి. కౌన్సిల్ హాల్లో ఉదయం 10 గంటలకు మేయర్ పీలా శ్రీనివాసరావు అధ్యక్షతన ఎన్నిక ప్రక్రియ ప్రారంభం కానుంది. మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఆ తర్వాత ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటిస్తారు. ఈ ఎన్నికల్లో స్టాండింగ్ కమిటీలోని 10 స్థానాల కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి పది మంది, తెలుగుదేశం పార్టీ నుంచి పది మంది కార్పొరేటర్లు పోటీ పడుతున్నారు. ఇదిలావుండగా జీవీఎంసీ స్థాయీ సంఘం ఎన్నికలో సీపీఎం పాల్గొనడం లేదని సీపీఎం జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు పేర్కొన్నారు. అలాగే 22వ వార్డు జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ కూడా ఓటింగ్‌లో పాల్గోవడం లేదని స్పష్టం చేశారు.

ఓటింగ్ ప్రక్రియ ఇలా..

స్థాయీ సంఘం ఎన్నికలు ఎమ్మెల్సీ ఎన్నికల తరహాలోనే జరుగుతాయి, కానీ ప్రాధాన్యత ఓట్లు ఉండవు. ఒక్కో కార్పొరేటర్‌కు 10 ఓట్లు ఉంటాయి. కార్పొరేటర్లందరూ తమ ఓటు హక్కును వినియోగించుకుంటే మొత్తం 95 ఓట్లు పోలవుతాయి. ఒకే బ్యాలెట్ పేపర్‌పై వైఎస్సార్ సీపీ, టీడీపీకి చెందిన 20 మంది అభ్యర్థుల పేర్లు ఉంటాయి.కార్పొరేటర్లు తమకు నచ్చిన 10 మంది అభ్యర్థుల పేర్ల ముందు టిక్ చేసి ఓటు వేయాల్సి ఉంటుంది. ఒక అభ్యర్థికి ఒక ఓటు చొప్పున గరిష్ఠంగా 10 మందికి 10 ఓట్లు వేయవచ్చు. ఎవరైనా 11 ఓట్లు వేస్తే ఆ ఓటు చెల్లనిదిగా పరిగణిస్తారు. ఒక అభ్యర్థికి 48 ఓట్లు వస్తే విజేతగా ప్రకటిస్తారు.

పోటీలో ఉన్న వైఎస్సార్ సీపీ అభ్యర్థులు

నిక్కల లక్ష్మి (20వ వార్డు), సాడి పద్మారెడ్డి (24వ వార్డు),పల్లా అప్పలకొండ (28వ వార్డు),బిపిన్ కుమార్ జైన్ (31వ వార్డు), గుండపు నాగేశ్వరరావు (40వ వార్డు), కోడిగుడ్ల పూర్ణిమ (41వ వార్డు), రెయ్యి వెంకటరమణ (51వ వార్డు), కేవీఎన్ శశికళ (55వ వార్డు), మహ్మద్ ఇమ్రాన్ (66వ వార్డు), ఉరుకూటి రామచంద్రరావు (70వ వార్డు)

టీడీపీ నుంచి..

మొల్లి హేమలత (5వ వార్డు), సేనాపతి వసంత (96వ వార్డు), రాపర్తి త్రివేణి వరప్రసాదరావు (92వ వార్డు),దాడి వెంకట రామేశ్వ రరావు (88వ వార్డు), రౌతు శ్రీనివాస్ (78వ వార్డు), మొల్లి ముత్యాలు (87వ వార్డు), మాదంశెట్టి చిన్నతల్లి (83వ వార్డు), కొణతాల నీలిమ (79వ వార్డు), గేదెల లావణ్య (17వ వార్డు), గంకల కవిత (47వ వార్డు)

కూటమికి షాక్!

- స్థాయీ సంఘం ఎన్నికకు జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్ దూరం
- జనసేనలో ఒక్కరికి కూడా అవకాశం కల్పించకుండా అవమానించారని ఆవేదన

దాబాగార్డెన్స్ : కూటమికి గట్టి షాక్ తగిలింది. ఇంతవరకు చెట్టాపట్టాలేసుకుని పైపైకి కనిపించినా.. కూటమిలో లుకలుకలు బహిర్గతమయ్యాయి. అవిశ్వాస తీర్మానం సమయంలో మేయర్ పదవి టీడీపీకి, డిప్యూటీ మేయర్ పదవి జనసేనకు కట్టబెట్టే యత్నంలో ఎంతో అన్యోన్యంగా వ్యవహరించిన ఆ రెండు పార్టీల్లో విభేదాలు తారస్థాయికి చేరాయి. జీవీఎంసీ స్థాయీ సంఘం ఎన్నికల్లో కనీసం ఒక్క సీటు కూడా జనసేనకు కేటాయించకపోవడంతో విభేదాలు ముదురు పాకాన పడ్డాయి. జీవీఎంసీ కౌన్సిల్ చివరి స్థాయీ సంఘం ఎన్నికల్లో కూడా జనసేన పార్టీలో ఉన్న వారికే కాదు.. ఆ పార్టీ పంచన చేరిన వారికి కూడా అవకాశం దక్కలేదు. అంతేగాక స్వతంత్ర కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ జనసేన దక్షిణ నియోజకవర్గ టికెట్ ఆశించి భంగపడ్డారు. అయినప్పటికీ జనసేనలోనే కొనసాగుతూ వచ్చారు. పార్టీ ఏదో పదవి ఇస్తుందన్న ఆశతో పార్టీలోనే ఉంటూ స్థాయీ సంఘం ఎన్నికల్లో బరిలో నిలిచినా.. కూటమి నాయకులు సాధిక్‌తో విత్‌డ్రా చేయించారు. కూటమిలో జనసేనకు ఎంత గౌరవం ఉందో అప్పుడే తేలిపోయింది. తాజాగా జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ స్టాండింగ్ కమిటీ ఎన్నికకు దూరంగా ఉంటున్నట్టు ప్రకటించారు. కూటమి ధర్మం ప్రకారం స్థాయీ సంఘం ఎన్నికల్లో జనసేన కార్పొరేటర్లకు మూడు స్థానాలు ఇవ్వాలని, అటువంటి అవకాశం లేదంటే..కనీసం ఒక్క స్థానమైనా ఇవ్వాలని, అదీ ఇవ్వలేదని మూర్తియాదవ్ పేర్కొన్నారు. గత స్థాయీ సంఘం ఎన్నికల్లో కూడా జనసేనకు మొండి చెయ్యి చూపారని, తాజాగా ఎన్నికల్లో కూడా ఖాళీ చెయ్యి చూపించారంటూ మండిపడ్డారు. స్థాయీ సంఘంలో జనసేనకు సముచిత స్థానం ఉంటేనే నగరాభివృద్ధికి.. ప్రజాసేవకు అవకాశం ఉండేదని.. ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా పోయిందంటూ బాహాటంగానే చెప్పుకొచ్చారు. 14 మంది జనసేన కార్పొరేటర్లలో (ఫిరాయింపు కార్పొరేటర్లతో కలిపి) ఒక్కరికైనా స్థాయీ సంఘం ఎన్నికల్లో అవకాశం కల్పించి ఉంటే సముచిత గౌరవం ఇచ్చినట్టు ఉండేదని, ఆ విధంగా ఇవ్వకపోగా నామినేషన్ వేసిన వారిని కూడా విత్‌డ్రా చేయించి అవమానపరిచారని తెలిపారు. కూటమిలో జరిగిన ఈ అవమానాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లనున్నట్టు పేర్కొన్నారు.

అనైతిక రాజకీయాలకు కూటమి తెర

సాక్షి, విశాఖపట్నం: జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నిక నేపథ్యంలో కూటమి నేతలు అనైతిక రాజకీయాలకు తెర లేపుతోందని వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు మండిపడ్డారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీలో గెలిచిన 27 మంది కార్పొరేటర్లు నిబంధనలకు విరుద్ధంగా ఫిరాయింపునకు పాల్పడ్డారని, వారికి స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ప్రజాస్వామ్యానికే విరుద్ధంగా ఓటు హక్కు కల్పిస్తున్నారంటూ మండిపడ్డారు. జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికలో కార్పొరేటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారని ఆరోపించారు.

క్లుప్తంగా

ఘన వ్యర్థాల నిర్వహణతో సంపద సృష్టి



మార్టూరు సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: ఘన వ్యర్థాల నిర్వహణతో పర్యావరణ పరిరక్షణతో పాటు, పునర్వినియోగం ద్వారా సంపద సృష్టించవచ్చని కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. మండలంలో మార్టూరు గ్రామంలో ఘన వ్యర్థాల నిర్వహణపై మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంట్లోని చెత్తను తడి, పొడిగా విడదీసి అందించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఘన వ్యర్థాలను పునర్వినియోగానికి వినియోగించే విధంగా వేరు చేసి అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీవో నాగలక్ష్మి, సీపీవో రామారావు, సర్పంచ్ కరణం రెవెన్యూనాయుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కల్యాణపులోవ రిజర్వాయర్ నీరు విడుదల



రిజర్వాయర్ నుంచి నీరు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే రాజు, తదితరులు

రావికమతం: మండలంలో చీమలపాడు పంచాయతీ కల్యాణపులోవ రిజర్వాయర్ నుంచి సాగునీటిని చోడవరం ఎమ్మెల్యే రాజు మంగళవారం విడుదల చేశారు. రోజూ 50 క్యూసెక్కుల నీటిని ఆయకట్టు ద్వారా విడుదల చేస్తామని, ప్రస్తుతం ఈ నీటిని నారుమడులకు మాత్రమే రైతులు ఉపయోగించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం పెద్దేరు కాలువలో పూడిక తీత పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ బాల సూర్యం, ఏఈ సూర్య, ఆయకట్టు చైర్మన్ బంటు రాము నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు కోమటి శంకర్రావు, తదితరులు పాల్గొన్నారు.

క్వారీ బాధితుల వినూత్న నిరసన



గాంధీ విగ్రహం వద్ద కళ్లకు గంతులతో నిరసన తెలుపుతున్న క్వారీ బాధితులు

నర్సీపట్నం: మాకవరపాలెం మండలం జి.కోడూరు క్వారీ బాధితులు మంగళవారం వినూత్న రీతిలో నిరసన తెలియజేశారు. ఆర్డీవో కార్యాలయం వద్ద కొనసాగుతున్న నిరాహార దీక్ష శిబిరం నుంచి ర్యాలీగా మున్సిపల్ స్టేడియంలోని గాంధీ విగ్రహం వద్దకు చేరుకున్నారు. కళ్లకు గంతలు కట్టుకుని క్వారీ అనుమతులు రద్దు చేయాలని నినాదాలు చేశారు. బీఎస్పీ నాయకుడు బొట్టా నాగరాజు, కాంగ్రెస్ నాయకుడు బొంతు రమణ మాట్లాడుతూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చెక్‌పోస్టులు పెట్టించడం కాదు, ముందు క్వారీ వాహనాలను ఆపితే చెక్‌పోస్టులు అవసరం లేదన్నారు. బాధిత రైతులకు స్పీకర్ న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకుడు ఈరెల్లి చిరంజీవి, వైఎస్సార్ సీపీ నాయకుడు మట్ల చంటిబాబు, బాధితులు పాల్గొన్నారు.






విజయవాడలో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెంనాయుడు, ఆప్కాబ్ చైర్మన్ వీరనారాయణ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న నాతవరం పీఏసీఎస్ పర్సన్ ఇంచార్జి మాణిక్యం, సీఈవో ఆదినారాయణ, సీహెచ్‌ఎన్ అగ్రహారం సొసైటీ సీఈవో మధుసూదనరావు, కొత్తకోట సొసైటీ సీఈవో రఘు, సిబ్బంది రమణ, కోటవురట్ల సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్ జనార్దన్

నాలుగు పీఏసీఎస్‌లకు ఉత్తమ అవార్డులు

నాతవరం/తుమ్మపాల/రావికమతం/కోటవురట్ల : ఉమ్మడి విశాఖ జిల్లాలో మొత్తం ఆరు, అనకాపల్లి జిల్లాలో నాలుగు ప్రాథమిక సహకార పరపతి సంఘాలు (పీఏసీఎస్) రాష్ట్ర స్థాయిలో సేవలకు అవార్డు పొందాయి. రాష్ట్ర సహకార సంఘం స్థాపించి 62వ సంవత్సరం పురస్కరించుకుని ఉత్తమ సహకార సంఘాల పురస్కార కార్యక్రమం ఈ నెల 4న విజయవాడలో జరిగింది.. వ్యవసాయ రైతులకు సకాలంలో రుణాలు అందించడంతో పాటు వ్యాపారాభివృద్ధి చేసి లాభాలు సాధించడంతో ఈ అవార్డులు పొందాయి. 2024-25 ఆర్థిక సంవత్సరానికి నాతవరం పీఏసీఎస్, తుమ్మపాల మండలం చింతనిప్పుల అగ్రహారం పీఏసీఎస్, 2023-2024వ సంవత్సరానికి రావికమతం మండలం కొత్తకోట సహకార సంఘం, కోటవురట్ల సహకారం సంఘం ఉత్తమ సేవా అవార్డులు పొందాయి.

విజయవాడ ఎన్టీఆర్ సహకార భవనంలో సోమవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, ఆప్కాబ్ చైర్మన్ వీరనారాయణ చేతుల మీదుగా నాతవరం పీఏసీఎస్ పర్సన్ ఇంచార్జి అపిరెడ్డి మాణిక్యం, సీఈవో ఆదినారాయణ, చింతనిప్పుల అగ్రహారం పీఏసీఎస్ సీఈవో మధుసూదనరావు, కొత్తకోట సహకార సంఘం సీఈవో గుర్రాల రఘు, కోటవురట్ల పీఏసీఎస్ సంఘం పర్సన్ ఇన్‌చార్జ్ వేచలపు జనార్దన్ రూ.20వేలు నగదుతో పాటు షీల్డు అందుకున్నారు.

అంధకారం.. తాండవం.!

- తాండవ ప్రాజెక్టుపై కానరాని విద్యుత్ వెలుగులు
- కూటమి ప్రభుత్వం వచ్చాక ఏర్పాటు చేయని లైట్లు



స్పిల్‌వే గేటు వద్ద పాడైన లైట్లు



తాండవ ప్రాజెక్టుపై వెలగని విద్యుత్ లైట్లు

నాతవరం: జిల్లాలో ఏకైక మేజర్ ప్రాజెక్టు తాండవ రిజర్వాయరు అంధకారంలో కొట్టుమిట్టాడుతోంది. విద్యుత్ దీపాలు పాడైనా మరమ్మతులు చేపట్టే నాథుడు కరువయ్యారు. ఈ నెల 10న ఖరీఫ్ పంట సాగు కోసం ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయడానికి నిర్ణయించారు. నీటి విడుదలకు స్పీకరు అయ్యన్నపాత్రుడు రానుండడంతో తాత్కాలికంగా ప్రాజెక్టుపై రెండు లైట్లు ఇటీవల ఏర్పాటు చేశారు. తాండవ ప్రాజెక్టు ఒక వైపు రైతులకు సాగునీరు సరఫరా చేస్తుంది.. మరో వైపు నిత్యం సందర్శకులకు ఆహ్లాదాన్ని ఇస్తుంది. తాండవ రిజర్వాయరు నీరు ఆధారంగా ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్‌లో అనకాపల్లి జిల్లా నర్సీపట్నం, పాయకరావుపేట, కాకినాడ జిల్లా తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల పరిధిలో 52 వేల ఎకరాలు సాగవుతున్నాయి. రెండు కొండల నడుమ సుందరంగా నిర్మించిన ఈ ప్రాజెక్టు అందాలు తిలకించేందుకు రెండు జిల్లాలు నలుమూలలు నుంచి నిత్యం పర్యాటకులు వస్తుంటారు. సెలవు రోజుల్లో తాండవ ప్రాజెక్టు పరిసరాలు మరింత సందడిగా కనిపిస్తాయి. అంత ప్రాధాన్యం ఉన్న తాండవ ప్రాజెక్టుపై విద్యుత్ వెలుగులు కానరాక అంధకారం అలముకుంటోంది.

తాండవ ప్రాజెక్టుపై గతంలో ఏర్పాటు చేసిన విద్యుత్ లైట్లు పాడైపోయాయి. వాటికి మరమ్మతులు చేపట్టకుండా వదిలేశారు. గతంలో తాండవ ప్రాజెక్టుపై స్పిల్‌వే గేట్ల వద్ద మొత్తం 40 నుంచి 50 లైట్లు వరకు ఉండేవి. ఈ దీపాల వెలుగుల్లో రాత్రి వేళ తాండవ రిజర్వాయరు ప్రాంగణమంతా చూడ ముచ్చటగా కన్పించేది. ప్రస్తుతం లైట్లు పూర్తిగా పాడైపోవడంతో సాయంత్రం అయ్యేసరికి చిమ్మ చీకటిలో తాండవ ప్రాజెక్టు కనిపిస్తోంది. చుట్టూ కొండలు కావడంతో విద్యుత్ వెలుగులు లేక చీకటి పడేసరికి భయానక వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో సందర్శకులు పొద్దుపోక ముందే తిరుగు ముఖం పడుతున్నారు.

రాత్రి వేళ సెల్‌ఫోన్ల వెలుగులో నీటి మట్టం పరిశీలన

తుఫాన్లు, వర్షాల సమయంలో తాండవ ప్రాజెక్టులో ప్రమాదస్థాయి నీటి మట్టం పెరిగినప్పుడు నీటి నిల్వలు రాత్రి వేళల్లో చూసేందుకు సిబ్బంది అష్టకష్టాలు పడుతున్నారు. సెల్‌ఫోన్ లైట్ల వెలుతురులో నీటి మట్టం పరిశీలించే పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాండవ ప్రాజెక్టు ప్రధాన గేట్ల నుంచి స్పిల్‌వే గేట్ల మధ్య దూరం రెండు కిలోమీటర్లు ఉంటుంది. తాండవ ప్రాజెక్టు ప్రమాద స్థాయి నీటి మట్టాన్ని నివారించాలంటే స్పిల్‌వే గేట్లు ఎత్తి నీటిని నదిలోకి విడుదల చేయాలి. స్పిల్‌వే గేట్ల వద్ద విద్యుత్ లైట్లు పూర్తిగా వెలగడం లేదు. ఇక్కడ పరిస్థితి రాత్రి సమయంలో చాలా దారుణంగా ఉంటుంది. కూటమి ప్రభుత్వం తాండవ ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రాధ్యాన్యత ఇచ్చింది తప్ప శిథిలమైన లైట్లు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపించలేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ప్రాజెక్టు పరిసరాల్లో విద్యుత్ దీపాల ఏర్పాటుకు కృషి చేయాలని కోరుతున్నారు.

ప్రతిపాదనలు చేశాం..



తాండవ ప్రాజెక్టుపై విద్యుత్ లైట్లు ఏర్పాటు చేసేందుకు నిధులకు ప్రతిపాదనలు చేశాం. అంధకారాన్ని నివారించేందుకు ఇటీవల రెండు లైట్లు వేశాం. మిగతా లైట్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడతాం. సిబ్బంది కొరత కారణంగా తాండవ ప్రాజెక్టుపై పర్యవేక్షణ లేదు. నీటి మట్టం పరిశీలించే వద్ద స్పిల్‌వే గేటు వద్ద ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేస్తాం. ఇటీవల విడుదలైన నిధులతో తాండవ కాలువలో పూడిక తీత పనులు చేస్తున్నాం.

– అనురాధ, డీఈ, తాండవ ప్రాజెక్టు

మునగపాక పీఎస్‌ను సందర్శించిన ఎస్పీ సిన్హా



మునగపాక పీఎస్ సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

మునగపాక: మునగపాక పోలీసు స్టేషన్‌ను మంగళవారం అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందితో కొంతసేపు తమకు కేటాయించిన విధుల తీరు తెన్నులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. సైబర్ నేరాలను నిరోధించేందుకు ఎప్పటికప్పుడు ప్రజలకు, యువతకు, విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పూడిమడక రోడ్డులో అధిక లోడుతో వెళ్తున్న వాహనాలపై కేసులు నమోదు చేయడంతో పాటు అతి వేగాన్ని నియంత్రించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామన్నారు. కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు గ్రామీణ ప్రాంతాల నుంచి మెయిన్‌రోడ్డుకు వచ్చే వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ఇసుక డ్రమ్‌లు ఏర్పాటు చేసేలా చూడాలని ఆదేశించామన్నారు.

రహదారి భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించుకోవాలని సూచించారు. గంజాయి, మద్యం వంటి మత్తు పదార్థాల జోలికి పోకుండా ఎప్పటికప్పుడు కౌన్సెలింగ్ ఇస్తున్నామన్నారు. యలమంచిలి సీఐ ధనుంజయరావు, ఎస్ఐ పి.ప్రసాదరావు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నాడు వ్యతిరేకించి.. స్మార్ట్‌మీటర్లను ఎలా బిగిస్తారు?

- వామపక్షాలు, ప్రజాసంఘాల నాయకుల ధర్నా



విద్యుత్ శాఖ ఎస్ఈ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వామపక్షాలు, ప్రజాసంఘాల నాయకులు

అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ పాలనలో స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలుగొట్టాలన్న మంత్రి నారా లోకేష్ ఇప్పుడు వాటిని ఇళ్లకు బిగించడం ముమ్మాటికీ మోసం చేయడమేనని వామపక్షాలు, ప్రజా సంఘాల నాయకులు గంటా శ్రీరామ్, వై.ఎన్.భద్రం, ఎం.రాములు విమర్శించారు. స్థానిక గవరపాలెంలో విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద వామ పక్షాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఇంట్లో దోపిడీకి ఆస్కారం కలిగించే విధంగా అదానీ విద్యుత్ స్మార్ట్‌మీటర్లను బిగించి ప్రజలపై భారం మోపుతున్నారన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అదానీ సంస్థకు స్మార్ట్‌మీటర్ల టెండర్లను కట్టబెట్టి భారీ అవినీతికి పాల్పడిందని ఆరోపించిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు రూ.10 వేల కోట్ల కుంభకోణానికి పాల్పడుతుందన్నారు. విద్యుత్ భారాలను తగ్గిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి, అధికారం చేపట్టిన ఏడాదిలోనే ప్రజలపై రూ.15,485 కోట్ల సర్దుబాటు చార్జీలను పెంచడం అన్యాయమన్నారు. మీటర్లకు అయ్యే ఖర్చు రూ.10 నుంచి రూ.17 వేల వరకు దశలవారీగా వినియోగదారులపై మోపడం మరింత దారుణమన్నారు. అధిక విద్యుత్ వినియోగించే సమయాల్లో అధిక రేట్లు నిర్ణయించి వసూలు చేస్తున్నారన్నారు. ప్రీపెయిడ్ మీటర్ల వల్ల అందరిపై అధిక భారం పడుతుందన్నారు. అదానీ స్మార్ట్‌మీటర్లు, సోలార్ విద్యుత్ ఒప్పందాలను రద్దు చేసే వరకూ పోరాటాలు చేస్తామని, పాత రీడింగ్ పద్ధతినే కొనసాగించాలన్నారు. వామపక్షాలు, ప్రజా సంఘాల నాయకులు పెంటకోట శ్రీనివాసరావు, బొప్పే ఉమామహేశ్వరరావు, కొళ్ల తేలయ్యబాబు, జి. సుభాషిణి, కోరుబిల్లి శంకరరావు, కొణతాల హరనాథ్‌బాబు, భీశెట్టి అప్పారావు, కాపుశెట్టి అప్పారావు, టి.సురేష్ పాల్గొన్నారు.

చదువుల తల్లికి సత్కారం

- ఐఏఎస్‌కు ఎంపికైన డాక్టర్ మానస
- మునగపాక అయ్యప్పస్వామిని దర్శించుకునేందుకు రాక
- ఘనంగా సన్మానించిన గ్రామస్తులు



మానసను సత్కరిస్తున్న మునగపాక వాసులు

మునగపాక: కృషి, పట్టుదల ఉంటే రాణించగలమని నిరూపించారు. వైద్యురాలిగా సేవలందిస్తూనే ఐఏఎస్ కావాలన్న తన లక్ష్యాన్ని సాధించారు. అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఈ ఘనత సాధించిన రావాడ సాయి మానస మంగళవారం మునగపాక వచ్చారు. తన ఇష్ట దైవమైన ఇక్కడి అయ్యప్పస్వామిని దర్శించుకున్నారు. శ్రీకాకుళానికి చెందిన రావాడ సాయి మానస విశాఖలో ఉంటున్నారు. ఆమె ఆంధ్ర మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసి విశాఖలోని చినవాల్తేరులో వైద్యాధికారిగా సేవలందిస్తున్నారు. ఐఏఎస్ కావాలన్నది ఆమె కోరిక. మూడేళ్లపాటు శ్రమించి సివిల్ సర్వీసెస్ పరీక్ష రాశారు. ఇటీవల విడుదలైన యూపీఎస్సీ పరీక్ష ఫలితాల్లో మంచి ర్యాంక్ సాధించి, ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. మానస శిక్షణ కోసం డెహ్రాడూన్ వెళ్లనున్నారు. అంతకు ముందు మునగపాకలోని అయ్యప్పస్వామికి మొక్కులు చెల్లించుకునేందుకు తల్లిదండ్రులతో కలిసి మంగళవారం ఆలయానికి వచ్చారు. వేదపండితులు సోమశేఖరశర్మ ఆశీస్సులు తీసుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అయ్యప్పస్వామి ఆలయ కమిటీ పెద్దలు మానసను ఘనంగా సత్కరించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్‌తోపాటు తల్లిదండ్రులు ప్రకాష్, ఉషారాణిల ప్రోత్సాహం మరువలేనిదన్నారు. ఆరోగ్య శాఖ కార్యదర్శిగా సేవలందించాలన్నది తన కోరిక అని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మొల్లేటి సరళ, కమిటీ సభ్యులు మొల్లేటి సత్యనారాయణ, పెంటకోట ఉమేష్, ఆడారి కాశీబాబు, జల్లేపల్లి కిష్టప్ప, వెలగా రామకృష్ణ, కాండ్రేగుల జగ్గారావు, పొన్నా కిరణ్, పూసర్ల వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీల ఆత్మీయ కలయికపై దుష్ప్రచారం తగదు

- జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు స్పష్టం

దేవరాపల్లి: ఉమ్మడి విశాఖ జిల్లాలోని జెడ్పీటీసీల ఆత్మీయ కలయికపై దుష్ప్రచారం చేయడం తగదని జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు అన్నారు. దేవరాపల్లి మండలం మామిడిపల్లిలో స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం మంగళవారం జెడ్పీటీసీ సభ్యుల ఆత్మీయ కలయికను ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలువురు జెడ్పీటీసీలు, జెడ్పీటీసీ భర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెడ్పీ వైస్ చైర్మన్ గిరిబాబు మాట్లాడుతూ స్థానిక జెడ్పీటీసీ కర్రి సత్యం గ్రామ దేవత మొక్కు తీర్చుకున్న నేపథ్యంలో ఆత్మీయ కలయిక పేరిట విందు ఏర్పాటు చేశారన్నారు. ఈ ఆత్మీయ కలయికను కొన్ని మీడియా సంస్థలు వక్రీకరించి జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్రకు వ్యతిరేకంగా సమావేశమైనట్లు అసత్య కథనాలు ప్రచురించి ప్రచారం చేయడాన్ని వైస్ చైర్మన్‌తోపాటు జెడ్పీటీసీలంతా తీవ్రంగా ఖండించారు. ఇలాంటి నిరాధారమైన విష ప్రచారాలు మానుకొని, ప్రజలకు వాస్తవాలను తెలియజేయాలని సూచించారు. తామంతా వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులమని, తమ నాయకుడు వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి మాటే తమకు శిరోధార్యమని స్పష్టం చేశారు. క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచే వైఎస్సార్‌సీపీలో గ్రూపు రాజకీయాలకు తావులేదని, చిన్నపాటి భేదాభిప్రాయాలు ఉన్నా పార్టీ పెద్దల సమక్షంలో సర్దుబాటు చేసుకుంటామని వారు స్పష్టం చేశారు.

ప్రాణం తీసిన కుటుంబ కలహాలు

- వృద్ధుడిని నాటు తుపాకీతో కాల్చిచంపిన మేనకోడలి భర్త



అప్పారావు మృతదేహంపై పడి విలపిస్తున్న భార్య

కొత్తవలస: మండలంలోని ముసిరాం గ్రామానికి చెందిన సిమ్మ అప్పారావు (60)ను తన మేనకోడలి భర్త, అనకాపల్లి జిల్లా కోటపాడు మండలం పాతవలస గ్రామానికి చెందిన సిమ్మ అప్పారావు అనే యువకుడు నాటు తుపాకీతో కాల్చి చంపిన ఘటన మంగళవారం సాయంత్రం కలకలం రేపింది. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు అప్పారావు చెల్లెలు అయిన చెల్లయ్యమ్మ కుమార్తె లక్ష్మిని పాతవలస గ్రామానికి చెందిన నిందితుడు అప్పారావుకి ఇచ్చి వివాహం జరిపించారు. వారికి ఒక కుమార్తె ఉంది. ఏడాదిన్నర కిందట కుటుంబ కలహాలతో నిందితుడి భార్య లక్ష్మి పాతవలస గ్రామంలో ఉరివేసుకుని మృతి చెందింది. ఆమెను నిందితుడే హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరించాడన్న ఆరోపణ ఉంది. అప్పటి నుంచి మృతుడు తన చెల్లెలు (లక్ష్మి తల్లి) కుటుంబ వ్యవహారాలను చక్కబెడుతున్నాడు. నిందితుడి కుమార్తె ఇటీవల రజస్వల అయింది. లక్ష్మికి చెందిన నగలు, డబ్బు ఇవ్వాలని మృతుడు అప్పారావును నిందితుడు అప్పారావు గత కొన్నిరోజుల నుంచి అడుగుతున్నాడు. ఈ విషయమై రెండు రోజుల కిందట కుటుంబ సభ్యుల మధ్య ఘర్షణ పడ్డారు. నగలు, డబ్బులు ఇవ్వకపోతే తుపాకీతో కాల్చిచంపేస్తానని హెచ్చరించాడు. మంగళవారం సాయంత్రం మృతుడు పశువుల కళ్లంలో ఉండగా.. అక్కడకు వెళ్లి మరోసారి బంగారం, డబ్బుల కోసం డిమాండ్ చేశాడు. గ్రామ పెద్దల సమక్షంలో ఇస్తానని చెప్పడంతో నిందితుడు ఆగ్రహం వ్యక్తం చేశాడు. తనవెంట తెచ్చుకున్న నాటు తుపాకీతో అప్పారావును కాల్చేశాడు. చనిపోయినట్టు నిర్ధారించుకున్నాక అక్కడి నుంచి పరారయ్యాడు. కుటుంబ సభ్యుల సమాచారంతో కొత్తవలస సీఐ షణ్ముఖరావు తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నిందితుడి కోసం గాలిస్తున్నారు. మృతుడికి భార్య అచ్చియ్యమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

యువకుడిపై దాడి



గాయపడిన రామమూర్తి నాయుడు

గొలుగొండ: చీడిగుమ్మల గ్రామంలో రెండు వర్గాల మధ్య గొడవ కారణంగా ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామానికి చెందిన రామమూర్తినాయుడు, శ్రీను టెంట్ హౌస్ నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం రాత్రి ఇద్దరి మధ్య గొడవ జరగడంతో శ్రీనుకు మద్దతుగా అదే గ్రామానికి చెందిన గోవింద్, మరో యువకుడు రామమూర్తినాయుడిపై దాడి చేశారు. దీంతో తీవ్ర గాయాలు పాలైన ఆయనను స్థానికులు వెంటనే నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. దాడి చేసిన ముగ్గురిపై మంగళవారం రామమూర్తినాయుడు గొలుగొండ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఎస్ఐ రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో యువకుడి అరెస్ట్



నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

అచ్యుతాపురం రూరల్ : మార్టూరు గ్రామంలో సోమవారం అర్ధరాత్రి జరిగిన సెల్‌ఫోన్ దొంగతనం కేసులో చందక గోపి అనే యువకుడ్ని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. గోపీ అర్ధరాత్రి సమయంలో గడియ విరగ్గొట్టి ఇంటిలో చొరబడి బెడ్ రూమ్‌లో పడుకున్న వ్యక్తుల నుంచి ఆరు సెల్‌ఫోన్లు, రూ.5 వేలు నగదు దొంగిలించారు. ఈ మేరకు మంగళవారం నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడి బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

13 ఏళ్ల తర్వాత చీటింగ్ కేసు నిందితుడి అరెస్ట్

చోడవరం: చోడవరం పోలీసులు ఎట్టకేలకు పదమూడేళ్ల తర్వాత ఓ చీటింగ్ కేసులో నిందితుడిని అరెస్ట్ చేశారు. నౌడు ప్రసాద్ అనే నిందితుడిని చోడవరం మండలం వెంకన్నపాలెం జంక్షన్ వద్ద పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. 2012లో నమోదైన ఒక చీటింగ్ కేసులో నిందితుడిగా ఉన్న యలమంచిలి మండలం ఎల్.కొత్తూరు గ్రామానికి చెందిన నౌడు ప్రసాద్ పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు. వెంకన్నపాలెం వద్ద పోలీసు పెట్రోలింగ్ చేస్తుండగా అటుగా వెళుతున్న ప్రసాద్‌ను హెడ్ కానిస్టేబుల్ నాగేంద్రకుమార్, కానిస్టేబుల్ అప్పలరాజు చాకచక్యగా పట్టుకున్నారు. నిందితుడ్ని అరెస్టు చేసి కోర్టుకు తరలించామని ఎస్ఐ నాగకార్తీక్ తెలిపారు.

ఈత కొలనులో మునిగి యువకుడి మృతి



భాస్కర రావు(ఫైల్)

అచ్యుతాపురం రూరల్/కశింకోట: కశింకోట: స్థానిక గవరపేటలో ఆశా కార్యకర్త ఇంట విషాదం నెలకొంది. ఆశా కార్యకర్త సవరాల పార్వతి ఏకైక కుమారుడు భాస్కరరావు(25) గాజువాకలోని సెలూన్ షాపులో ఇటీవల చేరాడు. మంగళవారం దుకాణాలకు సెలవు కావడంతో స్నేహితులతో కొండకర్ల వద్ద ఓ రిసార్టుకు వెళ్లాడు. అక్కడ స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొడుతూ ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించామని అచ్యుతాపురం సీఐ నమ్మి గణేష్ తెలిపారు. భాస్కరరావు మృతితో కశింకోటలో విషాదం అలుముకుంది. తనకు అండగా ఉండి జీవితాంతం ఆదుకుంటాడనుకున్న ఏకైక కుమారుడు మృతితో తల్లి పార్వతి కన్నీరు మున్నీరుగా విలపించింది.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి వినతి



ఆర్డీవో కార్యాలయంలో ఏవో శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

అనకాపల్లి: ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లాలోని అన్ని ప్రెస్‌క్లబ్‌ల పరిధిలోని జర్నలిస్టులు డిమాండ్స్ డే నిర్వహించారు. అందులో భాగంగా అనకాపల్లి ఆర్డీవో కార్యాలయంలో ఏవో శ్రీనివాసరావుకు ఏపీయూడబ్ల్యూజే జిల్లా నాయకులు, అనకాపల్లి ప్రెస్‌క్లబ్ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు మంగళవారం తమ సమస్యలు పరిష్కరించమని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మద్దాల రాంబాబు, జిల్లా అధ్యక్షుడు పెంటకోట జోగినాయుడు, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా కార్యదర్శి ఆళ్ల వెంకట అప్పారావు, అనకాపల్లి ప్రెస్ క్లబ్ కార్యదర్శి భీమరశెట్టి గణేష్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు చాగంటి సర్వారావు (అవ్వ) తదితరులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీని నెరవేర్చాలని, జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ల విషయంలో న్యాయం చేయాలని కోరారు. రాష్ట్ర, జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీలలో జర్నలిస్టుల యూనియన్‌కు ప్రాతినిధ్యం కల్పించాలని, వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ మరింత ప్రయోజనకరంగా ఇవ్వాలని, ప్రమాద బీమా పథకాన్ని తక్షణం పునరుద్ధరించాలని, ఇళ్ల స్థలాలు ఇస్తామన్న హామీని తక్షణమే అమలు చేయాలని, విశ్రాంత పాత్రికేయులకు ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న పెన్షన్ పథకాన్ని మన రాష్ట్రంలో కూడా ప్రారంభించాలని కోరారు.

క్లుప్తంగా

నిత్య వ్యాయామంతో ఆరోగ్యం

అనకాపల్లి: ఆరోగ్యంగా జీవించాలంటే నిత్యం వ్యాయామం, యోగా చేయాలని వైద్యుడు డి.డి.నాయుడు తెలిపారు. మంగళవారం స్థానిక గవరపాలెం వి.వి.రమణ రైతు భారతి హాల్లో జిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ 60 సంవత్సరాల నుంచి తరచూ బీపీ, సుగర్, కిడ్నీ వంటి వైద్య పరీక్షలు చేసుకోవాలన్నారు. పిల్లలు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ యోగాసనాలు, జిమ్‌కు వెళుతూ ఆరోగ్యం కాపాడుకోవాలన్నారు. భగవద్గీత చిన్న వయస్సు నుంచే చదివితే పెద్దయ్యాక బాధ్యతాయుతంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ వ్యవస్థాపకుడు కాండ్రేగుల అప్పారావు (కెప్టెన్.), సభ్యులు కాండ్రేగుల దుర్గా ప్రసాదరావు, శరగడం నూకరాజు, బొడ్డేడ అప్పారావు, కొణతాల త్రినాథ్, బుద్ధ తాతారావు తదితరులు పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డులు తొలగించి భూకబ్జా

అనకాపల్లి: మండలంలోని మారేడుపూడి పంచాయతీలో ప్రభుత్వ భూముల్లో పాతిన హెచ్చరిక బోర్డులను ఆక్రమణదారులు దర్జాగా తొలగించి కబ్జాలు చేస్తున్నారు. పంచాయతీ పరిధి ఎన్టీఆర్ కాలనీకి వెళ్లే రహదారిలో సర్వే నంబర్ 357లో ఐదు సెంట్ల ప్రభుత్వ స్థలంలో గుర్తు తెలియని వ్యక్తులు ప్రహరీ నిర్మాణ పనులు చేపడుతున్నారు. వాస్తవంగా 20 సంవత్సరాలు నుంచి రెవెన్యూ అధికారులు గ్రామాల్లో పట్టాలు ఇవ్వడం లేదు. ఇదే అవకాశంగా చేసుకుని కొంతమంది వ్యక్తులు బోగస్ పట్టాలను సృష్టించి తమ భూమిగా చూపిస్తున్నారు. ఇటువంటి పట్టాలపై పూర్తిస్థాయి దర్యాప్తు చేసినట్లయితే వాస్తవాలు తెలుస్తాయని పలువురు కోరుతున్నారు. సర్వే నంబర్ 390 చెరువుగెడ్డ భూమిలో వారం రోజుల క్రితం రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన ప్రభుత్వ భూమి బోర్డును కబ్జాదారులు తొలగించారు.

పుస్తకావిష్కరణ నేడు

అనకాపల్లి: జిల్లా సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో స్థానిక జార్జి క్లబ్ ఆవరణలో బుధవారం ఉదయం 10 గంటలకు సీనియర్ సిటిజన్స్ సావనీర్ పుస్తకాన్ని ఆర్డీవో షేక్ అయిషా, సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర అధ్యక్షుడు వి.నారాయణ మూర్తి ఆవిష్కరిస్తున్నట్లు సిటిజన్ జిల్లా అధ్యక్షుడు కె.వి.గౌరీపతి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో సీనియర్ సిటిజన్స్ హాజరు కావాలని కోరారు.

గ్రోయిన్ల పటిష్టానికి ప్రత్యేక చర్యలు



శిథిలమైన గ్రోయిన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

అనకాపల్లి టౌన్: సాగునీటి కాలువలు, గ్రోయిన్ల పటిష్టానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. మండలంలోని తుమ్మపాల, తగరంపూడి, దిబ్బపాలెం, సీతానగరం గ్రామాల్లో దెబ్బతిన్న గ్రోయిన్లను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ గ్రోయిన్‌లన్నీ శిథిలావస్థకు చేరాయన్నారు. దీనివల్ల రైతుల పొలాలకు సరిగా నీరు అందడం లేదన్నారు. వీటిని పటిష్ట పరచడానికి నివేదికలు తయారు చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు, సాగునీటి సంఘాల చైర్మన్లు, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు

అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు మంగళవారం 118 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,760	4,760
మొదటి రకం	4,090	4,250
రెండో రకం	3,760	4,000
మూడో రకం	3,000	3,400

అనకాపల్లి సినిమాలు

రాజా	: సార్ మేడమ్
సత్యనారాయణ స్క్రీన్-1	: కింగ్‌డమ్
సత్యనారాయణ స్క్రీన్-2	: జూనియర్
పర్తిసాయి	: మహావతార్ నరసింహ
వెంకటేశ్వర	: లోపలికి రా చెప్పేతా..
శ్రీ సత్య	: తమ్ముడు
రామచంద్ర	: హరిహర వీరమల్లు

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 68 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-7, బీ పాజిటివ్-23, ఓ పాజిటివ్-34, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యాలోకేష్ (9703613706)ను సంప్రదించవచ్చు.



శంకరంలో నిరుపయోగంగా నిలిచిపోయిన బస్టాప్



నిరుపయోగంగా బస్టాప్‌లు

- గ్రామ జంక్షన్లకు దూరంగా ఏర్పాటు
- ఎన్‌హెచ్-16లో విచిత్ర పరిస్థితి
- బస్సుల కోసం రోడ్డుపైనే నిరీక్షణ
- ఎండావానా కాలంలో ప్రయాణికుల ఇబ్బందులు



రేబాక జంక్షన్‌లో బస్టాప్ లేక రోడ్డుపైనే వేచి ఉన్న విద్యార్థులు



జంక్షన్‌కు కిలోమీటరు దూరంలో కాపుశెట్టివానిపాలెం బస్టాప్

తుమ్మపాల: జాతీయ రహదారి అధికారుల నిర్లక్ష్య వైఖరి వల్ల బస్టాప్‌లు నిరుపయోగంగా మారాయి. వీటిని గ్రామ జంక్షన్లకు దూరంగా నిర్మించడం వల్ల అటు ప్రయాణికులు రాకపోగా, ఇటు బస్సులు ఆపడం లేదు. దాంతో లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అయింది. పైగా వర్షాకాలంలో తడుస్తూ ఎండకాలంలో చెమటలు కక్కుతూ ప్రయాణికులతో పాటు విద్యార్థులు గ్రామ జంక్షన్లలోనే బస్సుల కోసం నిరీక్షిస్తూ ఇబ్బందులు పడుతున్నారు.

మండలంలో అనేక గ్రామాల్లో బస్టాప్‌లు ఉన్నాయి. వాటి నిర్వహణ సరిగ్గా లేక రోడ్లపైనే గంటల పాటు ఎండలో బస్సుల కోసం ఎదురు చూస్తున్నారు. ముఖ్యంగా జాతీయ రహదారి ఆనుకున్న గ్రామాల్లో బస్సు ప్రయాణం చేయాలంటే గంటల పాటు రోడ్లపైనే వేచిచూడాల్సిన దుస్థితి ఏర్పడింది. ఏ ఒక్కా గ్రామ జంక్షన్లలో బస్టాప్ లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా చెప్పవచ్చు. జీవీఎంసీలో అనకాపల్లి పట్టణంతోపాటు పరిసర గ్రామాలు విలీనమై పదేళ్ల దాటినా అనకాపల్లిలో గ్రేటర్ అభివృద్ధి జాడలు నేటికీ లేవు. దీంతోపాటు గత ప్రభుత్వంలో జిల్లా కేంద్రంగా ఏర్పడినప్పటికి ముఖ్యమైన జంక్షన్లలోనూ చెప్పుకోదగ్గ బస్టాప్‌లు ఏర్పాటు చేసేందుకు అధికారులు చొరవ చూపకపోవడంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా ఎన్-16 బస్టాప్‌లు ...

నూతనంగా అనకాపల్లి నుంచి ఆనందపురం వరకు 40 కిలోమీటర్ల మేర ఏర్పాటు చేసిన ఆరు లైన్ల జాతీయ రహదారిలో సర్వీస్ రోడ్డుకు ఇరువైపులా జాతీయ రహదారి విభాగం నిధులు వెచ్చించి బస్టాప్‌లను నిర్మించింది. ఇవి జంక్షన్లకు అర కిలోమీటరు దూరంలో ఉండటంతో విద్యార్థులు, ప్రయాణికులు వాటి వైపు కనీసం చూడలేదు. నిరుపయోగంగా ఉన్న బస్టాప్‌లు మందుబాబులకు అడ్డాగా తయారయ్యాయి. మండలంలో రేబాక, కాపుశెట్టివానిపాలెం గ్రామాల మధ్య ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు సమీపంలో బస్టాప్‌లు లేకపోవడంతో రోజూ కిలోమీటరు పైన నడుస్తూ బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు.

ఆర్టీసీ నిధులతో ఒక్క బస్టాప్ లేదు...

పట్టణానికి మూడు వైపులా జాతీయ రహదారి విశాఖపట్నం, విజయనగరం, విజయవాడ నగరాలకు విస్తరించి ఉంది. మరో వైపు ఏజెన్సీకి ప్రధాన ద్వారంగాను అనకాపల్లి పట్టణం ఉంది. నిత్యం వందల సంఖ్యలో ప్రజలు పట్టణానికి ఆర్టీసీ బస్సుల్లోనే రాకపోకలు చేయడంతో మంచి ఆదాయం సమకూరుతోంది. పట్టణంలో సుంకరమెట్టు జంక్షన్ మొదలు, బైపాస్ జంక్షన్, కొప్పాక, ఆర్డీవో కార్యాలయం, కొత్తూరు నర్సింగరావుపేట, సిరసపల్లి, మారేడుపూడి జంక్షన్ వరకు, అదేవిధంగా విజయనగరం వైపు బొజ్జన్నకొండ జంక్షన్, శంకరం, రేబాక, కాపుశెట్టివానిపాలెం, చింతనిప్పుల అగ్రహారం, గొల్లపేట, కోడూరు, మర్రిపాలెం జంక్షన్లలోనూ ఒక్క బస్టాప్ ఏర్పాటు చేయలేదు. నిత్యం ప్రజలు అధిక సంఖ్యలో ఆర్టీసీ బస్సుల కోసం రోడ్లు మీదకు వచ్చి వేచి చూస్తున్నారు. ఈ క్రమంలో పలు ప్రమాదాలు జరిగిన సందర్భాలు ఉన్నాయి.

విద్యుత్ కనెక్షన్ పునరుద్ధరించాలని ధర్నా



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం ముత్రాస్ కాలనీ రాతినుయ్యి (మోటార్ షెడ్ బోరు) విద్యుత్ కనెక్షన్ తక్షణమే పునరుద్ధరించాలని కోరుతూ మంగళవారం తహసీల్దారు కార్యాలయం వద్ద రైతులు ధర్నా చేశారు. ఇక్కడ బోరు ద్వారా 30 ఎకరాల్లో పంటలు పండిస్తున్నామని, మోటార్ షెడ్ విద్యుత్ పవర్ కనెక్షన్‌ను మూడు రోజులు క్రితం జీవీఎంసీ అధికారులు తొలగించారని వాపోయారు. ఖరీఫ్ సీజన్‌లో పంటలు వేసుకునేందుకు వ్యవసాయ, జీవీఎంసీ అధికారులు చర్యలు చేపట్టాలని తదితర డిమాండ్లతో ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో రైతులు బుద్ధ రమణాజీ, మళ్ల చక్రవర్తి, ఉల్లూరు గణేష్, కర్రి పరదేశినాయుడు, వేలం జగదీష్, పీలా శ్రీను, ఉల్లూరు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలలో అధిక పోషకాలు



తల్లిపాల ఉపయోగాలపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి వాణీజగదీశ్వరి

అనకాపల్లి టౌన్: తల్లిపాలలో అధిక పోషకాలు ఉంటాయని, అప్పుడే పుట్టిన బిడ్డకు ఈ పాలు ఎంతో ఆరోగ్యాన్ని ఇస్తుందని తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యాధికారి వాణీజగదీశ్వరి తెలిపారు. మండలంలోని తుమ్మపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి చినబాబు కాలనీ వరకు తల్లిపాల వారోత్సవాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల ఏడో తేదీ వరకు ఈ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. పుట్టిన బిడ్డకు తగిన పోషకాలు అందాలంటే తల్లిపాలు ఒకటే మార్గమన్నారు. బిడ్డ పుట్టిన 30 నిమిషాల నుంచి రెండు సంవత్సరాల వరకు తల్లి పాలు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో బి. మంగమ్మ, సిహెచ్‌వో శారద, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పంద్రాగస్టు పోటీలు



కశింకోట డీపీఎన్ జెడ్పీ హైస్కూలులో విద్యార్థుల కబడ్డీ ఆట



విద్యార్థులు ఆడుతున్న ఖో-ఖో

కశింకోట: స్థానిక డీపీఎన్ జెడ్పీ హైస్కూలులో మంగళవారం విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని కబడ్డీ, ఖో-ఖో, త్రోబాల్ పోటీలను నిర్వహించారు. విద్యార్థులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. హెచ్ఎం ప్రసాద్, విద్యా కమిటీ చైర్మన్ నక్కా నాగమణి, పీడీలు వి. ప్రభాకరరావు, పెంటకోట కమల, ఉపాధ్యాయ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాజకీయ కక్షతో ఆర్చిపై నామ ఫలకం ధ్వంసం



శ్మశాన వాటిక ఆర్చిపై ధ్వంసం చేసిన కొంత భాగం నామ ఫలకం

కశింకోట: స్థానిక గవరపేటలో సాధుమఠం శ్మశాన వాటిక ఆర్చిపై అమర్చిన నామ ఫలకం కొంత భాగాన్ని గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి ధ్వంసం చేశారు. వైఎస్సార్ సీపీ హయాంలో వివిధ రూపాల్లో నిధులు సమకూర్చి ఇక్కడ శ్మశాన వాటికను అభివృద్ధి చేశారు. ఈ నేపథ్యంలో ప్రవేశ ద్వారం ముందు భాగంలో ఆర్చిపై మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, తదితరుల పేర్లతో నామ ఫలకాన్ని ఏర్పాటు చేశారు. దానిలో కొంత భాగాన్ని ధ్వంసం చేశారు. రాజకీయ దురుద్దేశంతో ధ్వంసం చేశారని బుల్లిబాబు ఆరోపించారు.

ఎన్నికల హామీలు అమలు చేయకుండా మోసం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త మలసాల భరత్‌కుమార్
- కొట్నివీధి, నూతలగుంటపాలెం, కొత్తపల్లి గ్రామాల్లో బాబు ష్యూరిటీ... మోసం గ్యారంటీ



కొట్నివీధిలో బాబు ష్యూరిటీ...మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మలసాల భరత్‌కుమార్



నూతలగుంటపాలెంలో ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలుపుతున్న భరత్‌కుమార్, పార్టీ శ్రేణులు

కశింకోట: కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలకు మోసగిస్తుందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ విమర్శించారు. మండలంలోని నూతలగుంటపాలెం, కొత్తపల్లి గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని మంగళవారం రాత్రి నిర్వహించారు. ప్లకార్డులతో ప్రదర్శించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లికి వందనం పథకాన్ని అరకొరగా అందించి చేతులు దులుపుకున్నారన్నారు. అన్నదాత సుఖీభవ నగదు కంటితుడుపుగా రైతులకు అందించారన్నారు. పూర్తిగా అందక రైతులు పంటలు పండించలేని దుస్థితిని ఎదుర్కొంటున్నారన్నారు. అన్నదాత సుఖీభవ గత ఏడాది ఎగ్గొట్టి మోసగించారన్నారు. ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలెండర్లు సరిగ్గా అందడం లేదని, సొంత డబ్బు వెచ్చించి గ్యాస్ కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఎదుర్కొంటున్నారని విమర్శించారు. మండలంలో మొదటి సారిగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి విశేష ఆదరణ లభించింది. జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, వైస్ ఎంపీపీ నమ్మి మీనా, సర్పంచ్‌లు కలగా గున్నయ్యనాయుడు, కలిగెట్ల నూకరత్నం, కొట్టి రాము, శ్యామ్యూల్, మహిళా విభాగం జిల్లా నాయకురాలు సీటిపల్లి లక్ష్మి, మండల నాయకురాలు తగరంపూడి నూకరత్నం, బుదిరెడ్డి చిన్నమ్మలు, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు, మాజీ ఉపాధ్యక్షుడు కరక సోమునాయుడు, పార్టీ నాయకులు కలిగెట్ల నాయుడు, నమ్మి గణేష్, అద్దెపల్లి శ్రీనివాసరావు, తాళ్లపాలెం మాజీ సర్పంచ్ చిన్ని వల్లభనారాయణరావు పాల్గొన్నారు.

50 ఏళ్లు దాటిన వారికి పింఛన్లు ఎప్పుడిస్తారు?

అనకాపల్లి: సూపర్ సిక్స్ పథకాలు కోసం కూటమి ప్రభుత్వానికి ఓటు వేసి మోసపోయామని ప్రజలు వాపోతున్నారని వైఎస్సార్‌సీపీ నియోజవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని 84వ వార్డు ఇన్‌చార్జి కోరుకొండ రాఘవ ఆధ్వర్యంలో కోట్నివీధి రామాలయం వద్ద నుంచి బాబు ష్యూరిటీ...మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని మంగళవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా భరత్‌కుమార్ మాట్లాడుతూ ఏడాది పాలనలో సూపర్ సిక్స్ పథకాల్లో కొన్ని అమలు చేశారంటే, ప్రజలు పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటాలు చేయడం వల్లేనని తెలిపారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, కోట్నివీధి పార్టీ నాయకులు కరణం సతీష్, గాడి ముదిరినాయుడు, అప్పికొండ రవి, సేనాపతి సాయి, పైడిరాజు, మళ్లవరపు ఈశ్వరరావు, నూకేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గవరపాలెంలో..

గవరపాలెం 81వ వార్డు పరిధిలో వైఎస్సార్‌సీపీ గవర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బొడ్డేడ శివ ఇంటి వద్ద నుంచి బాబు ష్యూరిటీ...మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం నిర్వహిస్తున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, మాజీ ఎంపీ బీవీ సత్యవతి, రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ హాజరవుతారన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ ర్యాలీ



తాళ్లపాలెంలో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు, స్థానికులు ర్యాలీ

కశింకోట: మండలంలోని తాళ్లపాలెంలో ఇళ్లకు స్మార్ట్ మీటర్లు అమర్చవద్దని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. కార్మికులు, స్థానికులు హాజరై తాళ్లపాలెం కూడలి నుంచి జాతీయ రహదారి మీదుగా ర్యాలీ నిర్వహించి అక్కడి ఏపీఈపీడీసీఎల్ కార్యాలయంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి నాయకత్వం వహించిన సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అదానీ కార్పొరేట్ సంస్థకు లబ్ధి కలిగించడానికి స్మార్టు మీటర్లు బిగించి అధిక విద్యుత్ భారం మోపి ఎక్కువ బిల్లులు ప్రజల నుంచి వసూలు చేస్తుందని విమర్శించారు. ఈ విధానాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల వల్ల ఇంటికి గతంలో కంటే ఐదారు రెట్లు మేర విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయని ఆరోపించారు. రెక్కాడితేగాని డొక్కాడని కార్మికులు, ప్రజలు బిల్లులు చెల్లించలేక అప్పులు చేయాల్సిన పరిస్థితి ఎదుర్కొంటున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు తలొగ్గకుండా రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని విరమించుకోవాలన్నారు. ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి డి.డి. వరలక్ష్మి, కార్మిక సంఘాల ప్రతినిధులు ఎం. సత్తిబాబు, కె. నాగరాజు, బెన్నయ్య, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో సకాలంలో వైద్య సేవలు

- డీఎంహెచ్‌వో హైమావతి



తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్న డీఎంహెచ్‌వో హైమావతి

అనకాపల్లి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే పేద రోగులకు సకాలంలో వైద్య సిబ్బంది సేవలందించాలని డీఎంహెచ్‌వో ఎం.హైమావతి తెలిపారు. మండలంలో తరగంపూడి పీహెచ్‌సీని మంగళవారం ఆమె పరిశీలించి, తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాల్లో గర్భిణులకు తనిఖీలు, కాన్పులు జరిగే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామాల్లో జ్వరపీడితులకు రక్తనమూనాలు సేకరించి వ్యాధిని బట్టి సకాలంలో మందులు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్య అధికారి జి.పావని, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మన మిత్ర యాప్‌పై అవగాహన



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న జోనల్ కమిషనర్ చక్రవర్తి

అనకాపల్లి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వాట్సాప్ గవర్నెన్స్‌లో మన మిత్ర యాప్‌ను ప్రతి ఒక్కరూ వినియోగించుకుని ప్రభుత్వ సేవలను సులువుగా పొందాలని జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె. చక్రవర్తి తెలిపారు. పట్టణంలోని 83వ వార్డులో మన మిత్ర యాప్‌పై పారిశుద్ధ్య సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సేవలు వేగంగా సులభంగా ప్రజలకు చేరాలని ఉద్దేశంతో ఈ యాప్‌ను ప్రవేశ పెట్టినట్లు తెలిపారు. గ్రామ సచివాలయాల సిబ్బంది నరసింగరావు పేటలో ర్యాలీ నిర్వహించారు. యాప్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు.

పశువుల పెంపకందారులకు రుణాల మంజూరుకు కృషి

- ఉమ్మడి విశాఖ జిల్లా పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్



గవరపాలెం పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న చంద్రశేఖర్

అనకాపల్లి: పశువుల పెంపకందారుల ఆర్థిక పరిస్థితులను తెలుసుకుని ప్రభుత్వం ద్వారా రుణాలు మంజూరు చేసేందుకు కృషి చేయాలని ఉమ్మడి విశాఖ జిల్లా పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం. చంద్రశేఖర్ తెలిపారు. పట్టణంలోని గవరపాలెం, మండలంలో మార్టూరు పశువైద్య కేంద్రాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పశువుల రికార్డులు, స్టాక్ పుస్తకాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. సంకరజాతి పశువులకు ప్రస్తుతం థైలేరియాసిస్ టీకా కార్యక్రమం, పశువుల పెంపకందారుల ఆర్థిక స్థితిగతులపై సమగ్ర సమాచారాన్ని సేకరించడానికి నిర్వహిస్తున్న బ్లాంకెట్ సర్వే, లింగ-విభజిత వీర్యం వాడకం, ప్రయోజనాలు, లభ్యతపై రైతులకు అవగాహన కార్యక్రమాలు గ్రామాల్లో నిర్వహించాలని సూచించారు. పశువులు వ్యాధులు బారిన పడకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ద్వారా పశుగ్రాసం ఉత్పత్తిని ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో గవరపాలెం పశువైద్య అధికారి అనీల్‌కుమార్, మార్టూరు గ్రామం పశుసంవర్ధక శాఖ సిబ్బంది వసంత, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ పరిధిలో పారిశుధ్య పనులు



రైల్వే ఫ్లైఓవర్‌ను శుభ్రం చేస్తున్న తుమ్మపాల పంచాయతీ కార్మికులు

తుమ్మపాల: కొన్ని నెలలుగా అధ్వానంగా తయారైన జీవీఎంసీ పట్టణ పరిధిలోని రైల్వే ఫ్లై ఓవర్ రోడ్డును మంగళవారం తుమ్మపాల పంచాయతీ పారిశుధ్య కార్మికులు పరిశుభ్రం చేశారు. తెల్లవారు మొదలుకుని సాయంత్రం వరకు రోడ్లతో పాటు ఫుట్‌పాత్‌పై తుప్పలను, చెత్తను తొలగించారు. మధ్యాహ్నం ఫుట్‌పాత్ మీదనే భోజనం చేసి మండుటెండలో సాయంత్రం వరకు చెత్తను తొలగించి ట్రాక్టర్లతో తరలించి రోడ్డును అద్దంలా తయారు చేశారు. ఇంతవరకు బాగానే ఉంది కానీ.. జీవీఎంసీ పరిధిలో రోడ్డు, ఫ్లైఓవర్ల పరిశుభ్రతపై శ్రద్ధ చూపాల్సిన జీవీఎంసీ పారిశుధ్య విభాగం కనీసం పట్టించుకోలేదు. మెరుగైన పారిశుధ్యం కోసం జీవీఎంసీకి గ్రామ పంచాయతీలకు మించి ప్రభుత్వం లక్షల్లో నిధులు అందిస్తుంది. జిల్లా కేంద్రంగా ఉన్న పట్టణంతోపాటే కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలకు రాకపోకలు చేసే అధికారులు, పాలకులు, ప్రజలు ఈ రోడ్డు మీదుగానే ప్రయాణిస్తుండటం అందరికి తెలిసిందే. అంతటి ప్రాముఖ్యత ఉన్న ఫ్లై ఓవర్‌ను జీవీఎంసీ కాకుండా ఎటువంటి సంబంధం లేని తుమ్మపాల పంచాయతీపై పెట్టడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శంగా చెబుతున్నారు. రైల్వే వంతెన, రోడ్డు పరిశుభ్రతపై నిత్యం జీవీఎంసీ చొరవ తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్లాస్టిక్ సంచులు వినియోగించొద్దు



ప్లాస్టిక్ వినియోగించబోమని ప్రతిజ్ఞ చేస్తున్న బాలికలు

కశింకోట: పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ సంచుల వినియోగించరాదని హెచ్ఎం ఎంఎస్ స్వర్ణకుమారి కోరారు. కశింకోట బాలికల హైస్కూలులో ప్లాస్టిక్ సంచుల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై మంగళవారం సాగర్ సిమెంట్ పరిశ్రమ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిలో కలిసిపోవడానికి ఎక్కువ కాలం పడుతుందని, దీనివల్ల పర్యావరణానికి ముప్పు కానుందన్నారు. దీనిదృష్ట్యా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి నార సంచుల వాడకం పట్ల దృష్టి సారించాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు, ప్లాస్టిక్ సంచుల వినియోగించబోమని విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. నార బ్యాగులను విద్యార్థినుకు పరిశ్రమ తరఫున పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిమెంట్ పరిశ్రమ ఏజీఎం పి.వి. పాండురంగారావు, సిబ్బంది ఎ. శ్రీనివాసరెడ్డి, షేక్ మదీనావలి, ఎ. నారాయణరావు, పి. అప్పారావు, ఎల్. శ్రావణ్‌కుమార్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.